సాక్షి
మహబూబ్‌నగర్
శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



లక్ష్మీపల్లి.. మద్యానికి దూరం
చిన్నంబావి మండలంలోని లక్ష్మీపల్లి గ్రామస్తులు ఎనిమిదేళ్లుగా మద్య నిషేధం పాటిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. -8లో ▸



సీహెచ్‌సీల్లో సౌకర్యాలు
కోస్గి, మద్దూరు సీహెచ్‌సీల్లో సౌకర్యాలు కల్పించి ఆదర్శంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కమిషనర్ అన్నారు. -8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
32.7 /21.5
రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దసరా నాటికి కోర్టు ఏర్పాటు చేయండి



దేవరకద్ర: దసరా పండగ నాటికి దేవరకద్రలో కోర్టు ఏర్పాటు చేయాలని శుక్రవారం తెలంగాణ సచివాలయంలో లా సెక్రటరీ పాపిరెడ్డిని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా లా సెక్రటరీని శాలువాతో సత్కరించి పూలబొకే అందించారు. దేవరకద్ర నియోజకవర్గానికి కోర్టు ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. కోర్టు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు.

చట్టాలపై అవగాహన



పాలమూరు: జిల్లా జనరల్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన డీ–అడిక్షన్ సెంటర్‌ను జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీరాతో సమావేశం అయ్యారు. స్థానికంగా డీ–అడిక్షన్ సెంటర్ ద్వారా అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం సఖి కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఉన్న పరిస్థితులు, మహిళలు, అమ్మాయిలకు కల్పిస్తున్న రక్షణ చర్యలు, కౌన్సెలింగ్ విధానాలపై ఆరా తీశారు. ఆ తర్వాత జిల్లా జైలును సందర్శించారు. జైలులో కిచెన్ గదితో పాటు బ్యారక్ పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. అనంతరం న్యాయ చట్టాలపై ఖైదీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని ఖైదీలకు న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. జైలు సూపరింటెండెంట్ వెంకటేశం పాల్గొన్నారు.

నేడు గద్వాలకు కేటీఆర్ రాక
గద్వాల: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం గద్వాలకు రానున్నారు. మధ్యాహ్నం 3 గంటకు గద్వాలకు చేరుకుని పట్టణంలో భారీ ర్యాలీ తీసి.. అనంతరం 4 గంటలకు తేరుమైదానంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో పాల్గొంటారు. ఇదిలా ఉండగా.. మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో నాయకులు కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఈ మేరకు తేరుమైదానంలో ఏర్పాట్లను ఆ పార్టీ నాయకులు పర్యవేక్షించారు.

శివారు కిరికిరి
సర్వే నంబర్ల ఓవర్ ల్యాపింగ్‌తో అవస్థలు





వల్లూరు గ్రామానికి చెందిన అల్లి రంగయ్యకు సర్వే నం.93లో 4.22 ఎకరాలు, కాగుల నారాయణకు సర్వే నం.92లో 3.17 ఎకరాల భూమి ఉంది. వీరు దశాబ్దాలుగా తమకున్న విస్తీర్ణంలో కాస్తులోనూ ఉన్నారు. వల్లూరు శివారు ఒడ్డుకు ఆనుకొని ఉన్న పోలేపల్లి శివారులోని సర్వే నం.658లోని పట్టాదారు సర్వే చేయించి తమ విస్తీర్ణాన్ని సరి చూసుకునేందుకు కొలతలు చేయగా వల్లూరు శివారులోని సర్వే నంబర్లు 92, 93లోకి భూ విస్తీర్ణం చూపింది. దీంతో కాగుల నారాయణ, అల్లి రంగయ్యలకు చెందిన భూమిలోకి ఎకరం దాకా ఓవర్‌ల్యాప్ కావడంతో తమకు న్యాయం చేయాలని పలు మార్లు కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చి విన్నవిస్తూనే ఉన్నారు.

..అంతేకాకుండా జిల్లాలోని పలు గ్రామాల్లోనూ ఇలాంటి సమస్యలతో భూ యజమానులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహబూబ్‌నగర్ రూరల్ మండలం అల్లీపూర్, భూత్పూర్ మండలం తాటికొండ గ్రామాల శివారుల్లోని సర్వే నంబర్ల ఓవర్ ల్యాపింగ్‌తో పట్టాదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే దేవరకద్ర మండలం చౌదర్‌పల్లి, మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని ఓబ్లాయిపల్లి గ్రామాల శివారుల్లోని సర్వే నంబర్లు ఓవర్ ల్యాపింగ్ సమస్యతో పలువురు పట్టాదారులు ఇబ్బందులు పడుతున్నారు.



ఇక్కడ కనిపిస్తున్న ఖడీలు వల్లూరు- పోలేపల్లి గ్రామాల శివారు ఒడ్డు. దీనికి ఒకవైపు వల్లూరుకు చెందిన సర్వే నంబర్లు 92, 93 ఉండగా.. మరోవైపు పోలేపల్లికి చెందిన సర్వే నంబర్ 658 ఆనుకొని ఉన్నాయి. అయితే పోలేపల్లి సర్వే నం.658 మొత్తం విస్తీర్ణం 16.3 ఎకరాలు ఉండగా వల్లూరు సర్వే నం.92 విస్తీర్ణం 3.17 ఎకరాల పట్టా భూమి, సర్వే నం.93 లావుణిపట్టా భూమి ఉంది. కాగా.. పోలేపల్లి శివారులోని సర్వే నం.658లో పట్టాదారైన ఓ రైతు తన భూమి సర్వేకు పెట్టుకోగా కొలతలు చేపట్టడంతో పక్కనే ఉన్న శివారు ఒడ్డు దాటి భూ విస్తీర్ణం చూపించడంతో సర్వే నంబర్ల ఓవర్ ల్యాపింగ్ బయటపడింది. ఈ వివాదంతో సదరు పట్టాదారు రైతులు ఇబ్బందులు పడుతూ.. గొడవలకు దిగుతున్నారు.

- క్షేత్రస్థాయిలో ముదురుతున్న భూ సమస్యలు
- నేటికీ 85 ఏళ్ల నాటి గ్రామ నక్షా, టీపన్‌లే దిక్కు
- ఎటూ తేల్చలేకపోతున్న సర్వే అధికారులు
- భూ రీ సర్వే చేపడితేనే అన్ని సమస్యలకు పరిష్కారం

రెవెన్యూ గ్రామాలు	సర్వే నంబర్లు
316	6,91,529

మహబూబ్‌నగర్ న్యూటౌన్: క్షేత్రస్థాయి భూ సమస్యల్లో ప్రధానంగా సరిహద్దు వివాదాలు, గెట్టు పంచాయితీలే ఎక్కువగా ఉంటాయి. కానీ, ఇటీవల శివారు గ్రామాల సర్వే నంబర్ల ఓవర్‌ల్యాపింగ్ సమస్యలు సైతం భూ రికార్డులు, కొలతల శాఖకు తలనొప్పిగా మారాయి. సరిహద్దు సమస్యతో గొడవలు, వివాదాలు చెలరేగి పోలీస్‌స్టేషన్లు, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదులు పెరుగుతున్నాయి. గ్రామాల్లో సగానికి పైగా వివాదాలన్నీ భూ సమస్యలపైనే ఉంటుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. దీంతో ముదురుతున్న భూ వివాదాలు గొడవలకు దారి తీస్తున్నాయి. అధికార యంత్రాంగం సైతం పరిష్కరించలేక చేతులెత్తేయడంతో సమస్య మరింత జటిలంగా మారుతోంది. ఫలితంగా భూ యజమానులు శివారు సమస్యతో అవస్థలు పడుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 316 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. సర్వే నంబర్లు 6,91,529 ఉన్నాయి. గత 85 ఏళ్ల క్రితం క్షేత్రస్థాయి సర్వే చేసి తయారు చేసిన గ్రామ నక్షా, టీపన్ రికార్డుల ఆధారంగా ప్రస్తుతం భూ సర్వేలు చేస్తున్నారు.

హద్దు రాళ్ల ఆధారంగా..

అందుబాటులో ఉన్న సాంకేతిక సహాయంతో పట్టణాలు, మారుమూల గ్రామాల్లో సైతం గూగుల్ మ్యాప్ ఓపెన్ చేసుకొని అనుకున్న స్థలానికి చేరుకోగలుగుతున్నాం. ఒక సర్వే మ్యాపును దగ్గర పెట్టుకొని సర్వే నంబర్ ఎక్కడనేది గుర్తుపట్టడం అంత సులువైనది కాదు. భూమి మీద హద్దురాళ్లు ఉంటే తప్ప గుర్తించలేని పరిస్థితి. భూమి హక్కులు, హద్దులకు స్పష్టత, భద్రత ఉంటే సమస్యలు రావు. వచ్చినా వెంటనే పరిష్కారానికి ఆస్కారం ఉంటుంది. ప్రస్తుతం భూ సర్వే ఓ పెద్ద చిక్కుముడిలా మారింది. ఒక సర్వే నంబర్‌కు నాలుగు హద్దు రాళ్లు ఉండాలి. ఈ రోజుల్లో గ్రామం మొత్తంలో 15 నుంచి 20 హద్దురాళ్లు ఉంటే మహా ఎక్కువ. అందుబాటులో ఉన్న ఈ హద్దురాళ్లను ఆధారంగా చేసుకొని మిగతా భూమిని కొలతలు చేస్తున్నారు. జిల్లాలోని ఆయా గ్రామాల నుంచి భూ సర్వే కోసం వస్తున్న ఎఫ్–లైన్ పిటిషన్ల పరిష్కారం ఎండమావిగా మారింది. మరోవైపు సబ్‌డివిజన్ సమస్య ఆశించిన సర్వే నిర్వహణకు అడ్డంకిగా తయారైంది. ఇదిలా ఉంటే భూముల విలువలు పెరుగుతున్న తరుణంలో తాజాగా శివారు సర్వే నంబర్ల ఓవర్‌ల్యాపింగ్ సమస్య అధికారులు, భూ యజమానులను అయోమయానికి గురిచేస్తోంది. ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ఆర్‌ఓఆర్– 2025 భూ భారతి చట్టంలో పొందుపరిచిన విధంగా రీసర్వే జరిగితే కొత్త నక్షాలు (మ్యాపులు), టీపన్‌లు సిద్ధమవుతాయి. తద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియలోనూ మార్పులు రానున్నాయి. క్షేత్రస్థాయిలో అమ్మకాలు, కొనుగోళ్లలావాదేవీల నిర్వహణలో పూర్తి పారదర్శకత వచ్చే ఆస్కారం ఉంటుంది. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా గండేడ్ మండలం సాలార్‌నగర్ గ్రామంలో భూ రీ సర్వే చేపట్టారు. రాబోయే రోజుల్లో అన్ని గ్రామాల్లో నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. భూ రీ సర్వే జరిగితే శివారు సర్వే నంబర్ల ఓవర్ ల్యాపింగ్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

రీ సర్వేతోనే పరిష్కారం..



ప్రస్తుతం హద్దుల గొడవలు, గెట్టు పంచాయితీలు కుటుంబ వాతావరణాన్ని, గ్రామీణ వ్యవస్థను దూరం చేస్తుంది. ఇటీవల భూముల ధరలు విపరీతంగా పెరగడంతో అక్కడక్కడ శివారు సర్వే నంబర్ల ఓవర్ ల్యాపింగ్ సమస్య గ్రామాల మధ్య గొడవలకు కారణమవుతోంది. వీటన్నింటికి భూ రీ సర్వేతోనే పరిష్కారం దొరుకుతుంది.

– నాగయ్య, వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి

కమిషనర్‌కు నివేదిస్తాం..



జిల్లాలో కొన్నిచోట్ల శివారు సమస్యలు వస్తున్నాయి. కొన్ని రెవెన్యూ గ్రామాల శివారుల్లో సర్వే నంబర్ల ఓవర్ ల్యాపింగ్ ఉన్నట్లు తమ దృష్టికి వచ్చింది. ఈ సమస్యలపై తాము చేసేది ఏమీ లేదు. సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితిని సర్వే ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్‌కు నివేదిస్తాం. వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాల్సి ఉంటుంది.

– కిషన్‌రావు, సర్వే ల్యాండ్ ఏడీ

మహిళలకు ఆరోగ్య పరీక్షలు

- ఈ నెల 17 నుంచి చేపట్టనున్న ఆరోగ్యశాఖ
- ప్రతిరోజు ఐదు చోట్ల శిబిరాల ఏర్పాటు
- పీహెచ్‌సీల్లో ప్రత్యేక నిపుణులతో పరీక్షల నిర్వహణ



జిల్లాలో వివిధ రోగాలబారిన పడిన మహిళలు ఇలా..

బీపీ బాధితులు	క్యాన్సర్ రోగులు
47,725	228

షుగర్ వ్యాధిగ్రస్తులు 27,440

పాలమూరు: జిల్లాలో మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేయాలనే ఉద్దేశంతో తీసుకువచ్చిన 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' పథకం కింద ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు పరీక్షలు నిర్వహించడానికి ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రస్తుతం చాలామంది మహిళలు వృత్తిరీత్యా బిజీగా ఉండటం లేదా కొందరు మహిళలకు సరైన అవగాహన లేకపోవడంతో ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టడం లేదు. దీంతో వ్యాధి తీవ్రత పెరిగిన తర్వాత ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి సమస్యలను ముందే గుర్తించడానికి ఈ ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

వ్యాధి నిర్ధారణ అయితే..

మహిళలకు బీపీ, షుగర్, సర్వైకల్ క్యాన్సర్లకు సంబంధించిన పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ అయితే కావాల్సిన వైద్యం అందిస్తారు. రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు. ఇక అనుమానిత మహిళలకు క్షయ నిర్ధారణ పరీక్షలు చేస్తారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సికిల్ ఎనీమియా పరీక్షలు, వ్యాధి నిర్ధారణ జరిగితే ప్రత్యేక కార్డులు అందించి వైద్యం అందిస్తారు.

రోజుకు ఐదు శిబిరాలు

జిల్లాలో ఉన్న 22 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఒక ఏరియా ఆస్పత్రి, రెండు సివిల్ ఆస్పత్రులు, ఒక జనరల్ ఆస్పత్రుల్లో కలిపి ప్రతిరోజు ఐదు చోట్ల ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలకు గైనకాలజీ, కంటి, చెవి, ముక్కు, గొంతు, చర్మ, మానసిక, దంత సమస్యలపై ప్రత్యేక మహిళా వైద్య నిపుణులతో పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్షలు చేసిన తర్వాత ఎవరికైనా సమస్య ఉంటే కావాల్సిన వైద్యసేవలు అందిస్తారు.

ఏర్పాట్లు చేస్తాం..
ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే మహిళా వైద్య నిపుణులతో మహిళకు పరీక్షలు నిర్వహిస్తాం. ప్రతిరోజు ఐదు చోట్ల శిబిరాలు నిర్వహించి ఆశాలు, ఏఎన్‌ఎంలతో మహిళలను శిబిరాలకు తీసుకువచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తాం. ఈ కార్యక్రమంపై పూర్తిస్థాయిలో సూచనలు రావాల్సి ఉంది.

– కృష్ణ, డీఎంహెచ్‌ఓ

పత్తి కొనుగోలుకు పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, పక్కన అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): వానాకాలం సీజన్‌కు సంబంధించి అక్టోబర్ రెండో వారంలో రైతుల నుంచి పత్తి కొనుగోలు చేయడానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో ముందస్తు కార్యాచరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాఫీగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. సీసీఐ ఈ ఏడాది నుంచి కొత్తగా కిసాన్- కపాస్ యాప్ ప్రారంభించింది. దీని ద్వారా రైతులు తమ పంట ఉత్పత్తిని నమోదు చేసుకోవడంతోపాటు మిల్లు దగ్గర పంట విక్రయించడానికి ముందుగా స్లాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి క్రాప్ బుకింగ్ సక్రమంగా చేపట్టాలన్నారు. సీసీఐ కేంద్రాలకు వచ్చిన రైతులు తప్పనిసరిగా ఆధార్ కార్డు, మొబైల్ నంబరు, బ్యాంకు ఖాతాతో వేలి ముద్రల ద్వారా నవీకరణ ఆధార్ అథెంటికేషన్ చేయించుకోవాలన్నారు. రైతులు పత్తిని దళారులకు అమ్ముకోకుండా సీసీఐ కేంద్రాలలో విక్రయించి.. కనీస మద్దతు ధర రూ.8,110 పొందాలన్నారు. అలాగే తూనికలు, కొలతలు శాఖ జిన్నింగ్ మిల్లులలో ఉన్న వే బ్రిడ్జి పరిశీలించి ధ్రువీకరించాలన్నారు. సీసీఐ అధికారులు తగినంత సిబ్బందిని జిన్నింగ్ మిల్లులు వద్ద నియమించాలని పేర్కొన్నారు. జిల్లాలో 80,531 ఎకరాల్లో పత్తి సాగు కాగా 7,83,170 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు వ్యవసాయ అధికారులు చెప్పారు. ఇందుకోసం జిల్లాలో నాలుగు జిన్నింగ్ మిల్లులు మహబూబ్‌నగర్‌లో ఒకటి, జడ్చర్లలో మూడు జిన్నింగ్ మిల్లులు నోటిఫై చేయనున్నట్లు మార్కెటింగ్, సీసీఐ అధికారులు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి, ఏఎస్పీ రత్నం, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి, ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్, తూనికలు, కొలతల శాఖ అధికారి రవీందర్, జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు పాల్గొన్నారు.

మరమ్మతుల్లో వేగం పెంచాలి
ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలు, కేజీబీవీల్లో చేపట్టిన మరమ్మతు వేగవంతం చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మరుగుదొడ్లు, తలుపులు, నల్లాలు, పైపులు, కిచెన్, డైనింగ్ హాల్ మరమ్మతు చేయాలన్నారు. గురుకుల పాఠశాలలకు సంబంధించి భవనాల నిర్మాణం, టాయిలెట్స్, ప్రహరీలు, అదనపు తరగతి గదులు ఎంత వరకు నిర్మించారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మహిళా శిశు సంక్షేమ అధికారి జరీనాబేగం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకపై.. కక్షసాధింపు చర్యలా?

ఏపీ ప్రభుత్వం పత్రికల పట్ల వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని ప్రజా, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు అభిప్రాయపడ్డారు. ప్రజల గొంతుకగా నిలిచే పత్రికలపై కక్ష సాధింపు చర్యలను తీవ్రంగా ఖండించారు. ఏకంగా 'సాక్షి' కార్యాలయాల్లో సోదాలు చేయడం, జర్నలిస్టులపై కుట్రపూరితంగా కేసులు నమోదు చేయడం భావ్యం కాదని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం 'సాక్షి' కార్యాలయాల్లో సోదాలు ఆపి, ఎడిటర్ ఆర్.ధనుంజయరెడ్డి, ఇతర జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి తమ తప్పులను సరిదిద్దుకోవాలని హితవు పలికారు.



– సాక్షి, నాగర్‌కర్నూల్/ పాలమూరు/ చిన్నంబావి/ నారాయణపేట/ వనపర్తి టౌన్

జర్నలిస్టులపై కేసులు అన్యాయం



ప్రభుత్వాలు ఎప్పుడూ కూడా పత్రికలు రాసే కథనాలను విమర్శలుగా తీసుకుని వాటిని చక్కదిద్దుకునే ప్రయత్నాలు చేయాలి కానీ, జర్నలిస్టులపై కేసులు నమోదు చేసి, అరెస్టులు చేయడం సరికాదు. 'సాక్షి' ప్రతికపై దాడులను తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రభుత్వాల పనితీరుపై కథనాలు రాసే స్వేచ్ఛ జర్నలిస్టులకు ఎప్పుడూ ఉంటుంది. ఒకవేళ రాసిన కథనాల్లో ఏదైనా తప్పులు ఉంటే వాటిని ఆధారాలతో సహా నిరూపించుకోవాలి. ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఎవరైనా విమర్శను స్వీకరించడానికి సిద్ధంగా ఉండాలి తప్ప విమర్శ చేసే వారిని హింసకు గురిచేస్తాం.. టార్గెట్ చేస్తాం.. అంటే కుదరదు. ఒక రచయిత, జర్నలిస్టుల మీద దాడులు చేయడం, కేసులు పెట్టడం అన్యాయం.

– రాఘవాచారి, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్

దారుణమైన చర్య..



అధికారం ఉందనే అహంతో పత్రికల స్వేచ్ఛను హరించడం కరెక్ట్ కాదు. అధికారం ఐదేళ్లు మాత్రమే.. చివరగా సమాజానికి జర్నలిజం అనేది శాశ్వతం. రాజకీయాల ముసుగులో అధికారంలో ఉన్నామనే అహంతో 'సాక్షి' దినపత్రికపై కేసులు మోపడం కక్షసాధింపులకు దిగడం సరికాదు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు ప్రశ్నించే గొంతుకలను అణచివేయడం సమాజ శ్రేయస్కరం కాదు. ఒకవేళ పత్రికా ప్రకటనలలో తప్పుగా ఉంటే వాటికి వివరణ కోరాలి తప్ప ఫోర్త్ ఎస్టేట్‌పై ఉక్కుపాదం మోపడం దారుణమైన చర్య.

– కొత్త కల్యాణ్‌రావు, ఎన్‌ఆర్‌ఐ, కేఎంఆర్ ట్రస్టు చైర్మన్, చిన్నంబావి

పత్రికా స్వేచ్ఛను కాపాడాలి..



ప్రభుత్వం ఎవరైనా ప్రజా, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల నాయకులు ప్రెస్‌మీట్లు పెట్టడం భావ ప్రకటన రాజ్యాంగం కల్పించిన హక్కు. దానిని ప్రభుత్వం కాలరాయడం హాస్యాస్పదం. ఏపీలో 'సాక్షి' దినపత్రికపై కొనసాగుతున్న కేసులు, దాడులను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజాస్వామ్యంలో పత్రికలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సమంజసం కాదు. ఇప్పటికైనా ఏపీ సీఎం చంద్రబాబు కక్షసాధింపు చర్యలు మానుకుని పత్రికా స్వేచ్ఛను కాపాడితే వారికే మంచిది.

– జనార్దన్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, నారాయణపేట

రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి..



ప్రభుత్వాలు పత్రికా స్వేచ్ఛను కాపాడేందుకు రాజ్యాంగబద్ధంగా వ్యవహరించాలి. భావ ప్రకటన స్వేచ్ఛ, పత్రికా విలువలను కాపాడటంలో స్ఫూర్తిగా ఉండాలి. ప్రజల అభిప్రాయాలను తెలిపే పత్రికలను ప్రభుత్వాలు గౌరవించాలి. ఆంధ్రప్రదేశ్‌లో పాత్రికేయులపై కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. – బవాండ్ల వెంకటేశ్, టీఎన్జీవో ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షుడు, నాగర్‌కర్నూల్

కక్ష సాధింపు చర్యే..



పత్రికలు ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలు. భావ ప్రకటన హక్కులో భాగమైన పత్రికా స్వేచ్ఛను ప్రభుత్వాలు కాపాడాలి. పత్రికల్లో వచ్చిన వార్తలను ఏకీభవించకపోతే రిజాయిండర్, ఖండన ఇవ్వాలి. కానీ, జర్నలిస్టులపై కేసులు పెట్టడం సరికాదు. ఏకంగా పత్రికా ఎడిటర్‌పైనే కేసులు పెట్టి పోలీస్‌స్టేషన్‌లో విచారించడం కక్ష సాధింపు చర్యగానే కనిపిస్తుంది. ఏపీలో 'సాక్షి' ఎడిటర్‌పై ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అప్రజాస్వామికంగా ఉంది.

– బోనాసి రామచందర్, న్యాయవాది, నాగర్‌కర్నూల్

ప్రజల గొంతుక..



పత్రికా స్వేచ్ఛపై దాడి చేసే చర్యలకు పూనుకోవడం అప్రజాస్వామికం. ప్రజాస్వామ్యంలో ప్రజల గొంతుకగా నిలిచి.. ప్రభుత్వానికి- ప్రజలకు మధ్య పత్రికలు వారధిగా నిలుస్తాయి. ప్రజల పక్షాన నిలబడిన 'సాక్షి' దినపత్రిక ఎడిటర్‌పై అక్రమ కేసులు బనాయించడం రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధం. తక్షణమే అక్రమ కేసులను ఎత్తివేసి ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దుకోవాలి.

– రాజారాంప్రకాష్, ప్రజా వాగ్గేయకారుడు, వనపర్తి

పోలీసులు అప్రమత్తంగా ఉండాలి



రాజాపూర్ (బాలానగర్): శాంతిభద్రతలను కాపాడే క్రమంలో పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జానకి అన్నారు. శుక్రవారం ఆమె బాలానగర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. రికార్డులు పరిశీలించి వివిధ విభాగాల్లో జరుగుతున్న కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను వెనువెంటనే పరిశీలించాలని, స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడే క్రమంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి తక్షణ న్యాయం అందించాలని సూచించారు. ముఖ్యంగా నేరాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు, బీట్ వ్యవస్థను బలోపేతం చేయాలని ఎస్‌ఐ లెనిన్‌గౌడ్‌ను ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, పిల్లల భద్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించడంతోపాటు నేర నియంత్రణ, చట్ట వ్యవస్థ పరిరక్షణలో ప్రతిఒక్కరు కట్టుదిట్టంగా పనిచేయాలన్నారు. స్టేషన్ ఆవరణలో శుభ్రత, రికార్డుల నిర్వహణ మెరుగ్గా ఉండాలని చెప్పారు.

పొద్దస్తమానం పడిగాపులు
- యూరియా కోసం రైతుల అవస్థలు
- దుకాణాల ఎదుట గంటల తరబడి నిరీక్షణ

- వివరాలు 9లో

'డ్రై డే'ను తనిఖీ చేసిన అడిషనల్ కలెక్టర్



హబీబ్‌నగర్‌లోని ఓ ఇంటి వద్ద సంప్‌లో నిల్వ నీటిని పారబోయిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'డ్రై డే'ను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక శ్రీనివాసకాలనీలోని ఓ ఇంటి ఆవరణలో సంప్‌ను, బకెట్‌లో ఉన్న నీటిని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటినిల్వ ఎక్కువ రోజులు ఉండకుండా చూసుకోవాలన్నారు. పాతటైర్లు, నీటి డ్రమ్ములు, సంప్‌లలో వర్షపునీరు కలవకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు. ఇక నగరంలోని 60 డివిజన్ల పరిధిలో మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ తిరిగి పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి సంప్‌లు, డ్రమ్ములలో ఫినాయిల్ చల్లించారు. మురుగు గుంటలుగా మారిన ఓపెన్ ప్లాట్లలో దోమల నివారణకు గాను ఆయిల్ బాల్స్ వదిలారు. అలాగే పలుచోట్ల ఫాగింగ్ చేపట్టారు.



క్లుప్తంగా

అనారోగ్యంతో రిటైర్డ్ ఉపాధ్యాయుడి ఆత్మహత్య


విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం: అనారోగ్యంతో బాధపడుతూ రిటైర్డ్ ఉపాధ్యాయుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు.. జిల్లా కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీకి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి (62) ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ 5నెలల క్రితమే రిటైర్డ్ అయ్యాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ తీవ్ర మనస్థాపానికి గురై శుక్రవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు జనరల్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఘటనకు సంబంధించి మృతుడి తమ్ముడు హన్మంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని నాగనూలు చౌరస్తా సమీపంలో గురువారం రాత్రి చోటు చేసుకోగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలు.. తెల్కపల్లికి చెందిన భాషమోని వెంకటయ్య(40) గురువారం తన భార్యకు జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి వెళుతున్నానని చెప్పి బయటకు వచ్చాడు. ఈ క్రమంలో నాగనూలు చౌరస్తా సమీపంలో ఓ చికెన్ సెంటర్ వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉండటాన్ని శుక్రవారం ఉదయం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధార్ కార్డు ఆధారంగా మృతుడి వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణా బ్రిడ్జిపై శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. సూగూర్‌రెడ్డి (46)ద్విచక్రవాహనంపై టైరోడ్డు నుంచి దేవసూగేర్‌కు వెళ్తుండగా రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కర్ణాటక బస్సు ఢీ కొట్టింది. ప్రమాదంలో సూగూర్‌రెడ్డి కాళ్లు నుజ్జు నుజ్జు అయి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు వెంటనే రాయచూర్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అయిజ: పట్టణంలోని సంతబజార్ కాలనీకి చెందిన ఎరుకలి తిమ్మప్ప కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్థాపానికి గురై శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

గద్వాల క్రైం: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు. జములమ్మ రిజర్వాయర్‌లో శుక్రవారం ఉదయం కుళ్లిన స్థితిలో ఉన్న గుర్తు తెలియని మహిళ (37) మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రూరల్ పోలీసులను సంప్రదించాల్సిందిగా ఎస్‌ఐ పేర్కొన్నారు.

మాచన్‌పల్లి కేసులో ఐదుగురు రిమాండ్

మహబూబ్‌నగర్ క్రైం: మాచన్‌పల్లి యువకుడి అనుమానస్పద కేసులో రూరల్ పోలీసులు ఐదుగురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. మాచన్‌పల్లి దర్పల్లి వెంకటేష్ కేసులో మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆత్మహత్య చేసుకోవడానికి ప్రేరేపించారు అనే కోణంలో ఐదుగురిపై 108 బీఎన్‌ఎస్, 306 సెక్షన్స్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కేసులో వెంకటేష్‌పై దాడి చేసిన గాజులపేట నర్సింహులు, రాఘవేందర్, మల్లేష్, రవి, రాములును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. మృతుడి శరీర భాగాలపై గాయాలు ఉన్నట్లు గుర్తించామని ఎలా మృతి చెందాడు అనేది పోస్టుమార్టం రిపోర్ట్‌లో వైద్యుడు ఇచ్చే నివేదికలో తెలుస్తుందన్నారు. పీఎంఈ రిపోర్ట్ ప్రకారం కేసులో మార్పులు ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం దాడి చేసినందున ఐదుగురిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు పంపించినట్లు వెల్లడించారు.

లక్ష్మీపల్లి.. మద్యానికి దూరం



- ఎనిమిదేళ్లుగా నిషేధాజ్ఞలు
- చిన్నగ్రామమైన ఎంతోమందికి ఆదర్శం
- మహిళా ప్రజాప్రతినిధుల హయాంలో తీర్మానం
- యువకుల చొరవతో విజయవంతంగా అమలు

చిన్నంబావి: పేరుకే చిన్న గ్రామమైనా.. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నది. అక్కడి ప్రజలు మద్యం వల్ల వచ్చే అనర్థాలను గుర్తించి ఒక నిర్ణయం తీసుకుని ఎంతోమందికి ఆదర్శమైంది. ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతున్న ప్రస్తుత పరిస్థితిల్లో వనపర్తి జిల్లా లక్ష్మీపల్లి గ్రామస్తులు పట్టుదలతో 8ఏళ్లుగా మద్యనిషేధాన్ని అమలు చేస్తున్నారు. ఆ రోజు గ్రామస్తులు, యువత తీసుకున్న నిర్ణయంతో నేడు ఆ గ్రామంలో మద్యం మచ్చుకైనా లేకుండా పోయింది. తాగుడుకు బానిసైన వారు కూడా మద్యం మాని చక్కగా వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. లక్ష్మీపల్లి ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తూ అందరి మొప్పు పొందుతుంది.

మహిళా శక్తి..

2017 సంవత్సరంలో గ్రామంలో అందరు మహిళా ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ఈ మద్యపాన నిషేధానికి శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఎంపీపీ, సర్పంచ్, వార్డు సభ్యులు అందరు మహిళలు కావడం గ్రామానికి చెందిన యువకులతో కలిసి మద్యపాన నిషేధాన్ని అమలు చేశారు.

అప్పట్లో నిత్యం పంచాయితీలే..

గ్రామంలో సుమారు 400కుటుంబాలు 1,400వరకు జనాభా ఉంది. అప్పట్లో మద్యం, సారా విక్రయాలు జోరుగా సాగేవి. కొందరు తాగుడుకు బానిసై వ్యవసాయ పనులకు వేళ్లేవారు కాదు. రోజు ఏదో ఒక పంచాయితీ ఉండేది. భార్యాభర్తల మధ్య నిత్యం గొడవలు తలెత్తి కుటుంబాలు కూలే స్థితికి చేరాయి. వివాదాలకు మూలమైన మద్యాన్ని గ్రామం నుంచి తరిమివేయాలనే ఆలోచన కొందరి యువతకు తట్టింది. అనుకున్నదే తడవు కొందరు గ్రామపెద్దలు, రాజకీయ నాయకులతో సమావేశమై గ్రామంలో సారా, మద్యం విక్రయించొద్దని తీర్మానం చేసుకున్నారు. దుకాణాదారులు, విక్రయదారులకు కొంత గడువు ఇచ్చి నెల రోజుల్లోనే మద్యనిసేధాన్ని పాటించారు. గ్రామంలో శీతలపానీయాలు తప్పా మద్యం అమ్మకాలు పూర్తిగా నిషేధం.

చాలా సంతోషంగా ఉంది



తాను ఎంపీపీగా ఉన్న సమయంలో మా గ్రామంలో అందరం మహిళా ప్రజాప్రతినిధులే ఉండాలనే సంకల్పంతో మహిళనే సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నాం. గ్రామాభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ముఖ్యం. తాము ఎన్నికైన తర్వాత గ్రామ అభివృద్ధి చెందాలంటే ముఖ్యంగా మద్యపాన నిషేధం అవలంబించాలనే ఆలోచనలో ఉండగా.. గ్రామ యువత ముందుకురావడంతో ఆ పని చాలా సులువుగా మారింది. ఇప్పటికీ గ్రామంలో మద్యపాన నిషేధం ఉండడం చాలా సంతోషంగా ఉంది.

– లావణ్యప్రసాద్, మాజీ ఎంపీపీ, లక్ష్మీపల్లి

ఆర్థికంగా నష్టపోతున్నామని..



గ్రామంలో విచ్చలవిడిగా మద్య విక్రయాలు జరుగుతుంటే వ్యవసాయ పనులు, కూలీలకు వెళ్లేవారు కాదు. దీంతో ఆర్థికంగా రైతుల కుటుంబాలు నష్టపోతున్నాయని గ్రహించి తాను గ్రామానికి చెందిన కొంతమంది స్నేహితలతో కలిసి మద్యపాన నిషేధానికి పూనుకున్నాం. కానీ ఇన్ని సంవత్సరాలు విజయవంతంగా నడుస్తుందని ఊహించలేదు.

– పరమేశ్‌యాదవ్, లక్ష్మీపల్లి

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

గ్రామంలో 2017అక్టోంబర్ 8వ తేదీన గ్రామంలో మద్యపాన నిషేధాన్ని ఏర్పాటు చేశారు. యువత, గ్రామపెద్దలు, రాజకీయ నాయకులు కలిసి 8ఏళ్లుగా మద్యపాన నిషేధాన్ని అమలు చేయడానికి ప్రధాన కారణం. గ్రామంలో మద్యం ఎవరైనా విక్రయిస్తే వారికి రూ.పదివేల జరిమానగా విధించడంతో ఎవరు కూడా గ్రామంలో విక్రయాలు జరపడం లేదు.

జరిమానా కాదు.. బాధ్యతను గుర్తుచేశారు

- డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి వినూత్న శిక్ష
- మద్యం తాగడం వల్ల జరిగే అనర్థాలపై గంటసేపు వాహనదారులకు అవగాహన కల్పించాలని ఆదేశం



ఉదయం 10.30 గంటల సమయంలో గద్వాల జిల్లా కేంద్రంలో బిజీ ట్రాఫిక్ ఉంది. జిల్లాకోర్టు సమీపంలోని కూడలిలో ఇద్దరు వ్యక్తులు 'మద్యం వద్దు.. ఫ్యామిలీ ముద్దు', 'మద్యం సేవించి వాహనాలు నడపరాదు' అనే ప్లకార్డులు పట్టుకొని నిలబడ్డారు. అటుగా వెళ్లే వాహనదారులందరూ స్వచ్ఛంద సంస్థకు చెందిన సభ్యులు ప్రచారం చేస్తున్నారేమోనని అనుకున్నారు. కానీ అది కాదు.. వీరి పేరు రాజు, వీరన్న. ఈ నెల 9వ తేదీన కేటీదొడ్డి మండలకేంద్రంలో మద్యం సేవించి.. వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. 11వ తేదీ గద్వాల జూనియర్ సివిల్ కోర్టులో హాజరు పరిచారు. ఒకట్రెండు రోజులు జైలు శిక్ష లేక జరిమానా విధిస్తారని అనుకున్నారు. కానీ జడ్జి ఉదయ్‌నాయక్ వినూత్నంగా తీర్పు ఇచ్చారు. శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు జిల్లాకేంద్రంలోని ప్రధాన కూడలిలో గంటపాటు మద్యం తాగడం వల్ల జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అందులో భాగంగానే ట్రాఫిక్ ఆర్ఎస్ఐ బాలచంద్రుడు ఆధ్వర్యంలో శిక్షను అమలు చేశారు. కాగా.. న్యాయమూర్తి ఆదేశాలపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జరిమానాలు చెల్లించడం కంటే బాధ్యతను తెలియజేయడం చాలా బాగుందని చెప్పారు.

– గద్వాల క్రైం

బ్యాంకులో దూరిన కొండచిలువ


కొండచిలువను పట్టుకున్న గణేశ్‌నాయుడు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకులోకి కొండచిలువ దూరడంతో కలకలం రేగింది. గురువారం రాత్రి బ్యాంకు ఎదుట నుంచి కొండచిలువ వెళ్తుండగా అక్కడే ఉన్న కొందరు యువకులు దాన్ని తరిమే ప్రయత్నం చేశారు. ఇంతలో కొండచిలువ బ్యాంకు షెట్టర్ మీదుగా లోపలికి దూరింది. గమనించిన స్థానికులు విషయం బ్యాంకు మేనేజర్‌కు ఫోన్ చేసి తెలిపారు. శుక్రవారం ఉదయం బ్యాంకు మేనేజర్‌తో పాటు సిబ్బంది అక్కడికి చేరుకుని డోర్ తెరిచి లోపలికి వెళ్లి చూశారు. షెట్టర్ వెనకాల ఉన్న కొండచిలువను గుర్తించి వేముల గ్రామానికి చెందిన గుజ్జుల గణేశ్‌నాయుడుకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఆయన బ్యాంకు వద్దకు వచ్చి కొండచిలువను పట్టుకొని పెద్దగుట్టపై వదిలేశాడు.

దాడి ఘటనలో ఐదేళ్ల జైలుశిక్ష

మహబూబ్‌నగర్ క్రైం: పాత కక్ష్యల నేపథ్యంలో దాడి చేసిన ఘటనలో ముగ్గురు వ్యక్తులకు ఐదేళ్ల జైలుశిక్ష పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నవాబ్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని కాకర్లపహాడ్ గ్రామానికి చెందిన పశం కనకయ్య, పశం యాదయ్య, గుట్ట నర్సింహులుపై 19 మే 2020న పాత కక్ష్యల నేపథ్యంలో రాజు, నారాయణ, భానుతేజ అనే ముగ్గురు ఇనుపరాడ్లు, కత్తులు, బీరు సీసాలు, కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిపై బాధితుల ఫిర్యాదు మేరకు గతంలో నవాబ్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరుపర్చగా వాదనలు విన్న అదనపు సహాయ సెషన్స్ న్యాయమూర్తి రాధిక నేరం రుజువు కావడంతో నిందితులు రాజు, నారాయణ, భానుతేజలకు ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన పోలీస్ సిబ్బంది, పబ్లిక్ ప్రాసిక్యూటర్స్‌ను ఎస్పీ జానకి అభినందించారు.

పోలీసులపై దాడి చేసిన వ్యక్తికి జైలుశిక్ష

కల్వకుర్తి టౌన్: విధి నిర్వహణలో ఉన్న పోలీస్ సిబ్బందిపై దాడిచేసిన వ్యక్తికి రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ కల్వకుర్తి అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి శ్రీదేవి శుక్రవారం తీర్పు ఇచ్చారు. ఎస్‌ఐ మాధవరెడ్డి వివరాల మేరకు.. కల్వకుర్తిలోని ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉండే నిందితుడు సైదులుపై జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో 2019లో కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా జడ్చర్ల పోలీసులు అతడిని వెతుకుండగా.. కల్వకుర్తిలో ఉన్నాడని తెలిసి అతడు ఉండే ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో అతడు పోలీసులకు చిక్కకుండా పారిపోవడానికి యత్నిస్తూ.. వారిపై దాడి చేశాడు. పోలీసుల ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ నర్సింహులు కేసు నమోదు చేశారు. కల్వకుర్తి అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీదేవి నిందితుడు సైదులుకు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. సరైన సాక్ష్యాధారాలు కోర్టులో ప్రవేశపెట్టిన పీపీ గోపాల్, ఎస్‌ఐ మాధవరెడ్డి, కోర్టు కానిస్టేబుల్ బాలును ఎస్పీ అభినందించారు.

బకాయి నిధులు విడుదల చేయాలి

బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్


మాట్లాడుతున్న బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్

మహబూబ్‌నగర్ రూరల్: నాలుగేళ్లుగా బకాయి ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల నిధులను విడుదల చేయాలని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుపల్లి కృష్ణయాదవ్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బీకే రెడ్డి కాలనీ బీసీ బాలుర కళాశాల హాస్టల్‌లో బీసీ జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. పేద విద్యార్థులు మధ్యలోనే చదువులు మానుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 22నెలలు గడిచినా విద్యా వ్యవస్థపై సరైన దృష్టి పెట్టడం లేదని, విద్యార్థుల భవిష్యత్‌తో ఆడుకుంటే సహించేది లేదని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న రూ.6వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకార వేతనాల నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు నరేందర్, నవీన్, హరి, రాము, ప్రవీణ్, శ్రీకాంత్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

కోతుల దాడిలో ముగ్గురికి తీవ్ర గాయాలు


కోతుల దాడిలో గాయపడిన అనెం మాణిక్యప్ప


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కందెన్‌పల్లి రాములు

10 రోజుల వ్యవధిలో 10 మందికి గాయాలు

మద్దూరు: పట్టణంలో కోతుల దాడిలో ముగ్గురికి గాయాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. దీంతో పట్టణంలోని ప్రజలు కోతులను చూస్తే భయపడిపోతున్నారు. పట్టణంలోని అమర్‌గడ్డ ప్రాంతంలో అనెం మాణిక్యప్ప కోతులు దాడి చేయగా చేతికి తీవ్రంగా గాయాలయ్యాయి. వెంటనే చుట్టపక్కల వారు గమనించి కోతులను తరిమివేసి బాధితుడిని ఆస్పత్రికి తలరించారు. కొద్దిసేపటి తర్వాత ఇదే కాలనీలోని కందెన్‌పల్లి రాములు, తాండూరుకు చెందిన మోహన్‌ను సైతం కోతులు కరిచాయి. వీరిని వెంటనే మద్దూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 2న ఇద్దరిని, 5న మరో ఐదుగురు కోతుల దాడిలో గాయపడ్డారు.

మద్దూరు, కోస్గి సీహెచ్‌సీల్లో అన్ని సౌకర్యాలు


మద్దూరు సీహెచ్‌సీలోని చిన్నపిల్లల వార్డును పరిశీలిస్తున్న రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చొంగ్తు

- రాష్ట్రంలోనే మోడల్ ఆస్పత్రులుగా తీర్చిదిద్దుతాం
- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డా.క్రిస్టినా జెడ్ చొంగ్తు

మద్దూరు/కోస్గి రూరల్: నారాయణపేట జిల్లాలోని మద్దూరు, కోస్గి సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించి.. రాష్ట్రంలోనే మోడల్ ఆస్పత్రులుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డా.క్రిస్టినా జెడ్ చొంగ్తు అన్నారు. శుక్రవారం కలెక్టర్ సిక్తా పటాన్యాయక్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ ఫణింద్రారెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్, ఏడీఏఈ వాణి, సీఐఓ మంజునాథ్, టీజీఎంఎస్ఐడీసీ ఈడీ కొటిశ్వా, డీఎంహెచ్ఓ జయచంద్రమోహన్‌లతో కలిసి ఆమె మద్దూరు, కోస్గి సీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆస్పత్రుల్లోని అన్ని వార్డులను పరిశీలించి.. రోగులకు కల్పిస్తున్న సదుపాయాలపై ఆరా తీశారు. ఇంకా ఏఏ సౌకర్యాలు కల్పించాలనే వివరాలను తెలుసుకున్నారు. మద్దూరు సీహెచ్‌సీకి రోజు 200 నుంచి 300 వరకు ఓపీ వస్తున్నారని సూపరింటెండెంట్ పావని వివరించారు. కాగా, ఆస్పత్రిలో డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలని.. వైద్యులు వచ్చే వేళలు తప్పనిసరిగా ఉండాలని క్రిస్టినా జెడ్ చొంగ్తు ఆదేశించారు. అనంతరం అధికారులతో ఆమె సమీక్షించారు. మద్దూరు, కోస్గి సీహెచ్‌సీలను మోడల్ ఆస్పత్రులుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని.. అందుకు కావాల్సిన సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. మద్దూరు ఆస్పత్రికి ప్రహరీ నిర్మాణం, 24 గంటలపాటు వైద్యులు అందుబాటులో ఉండాలని, అన్ని రకాల పరీక్షలు ఇక్కడే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలన్నారు. ఎన్‌సీడీల ట్రైనింగ్, బ్లడ్ స్టోరేజీ యూనిట్లను కోస్గిలో ఏర్పాటు చేయాలని అన్నారు. స్క్రీనింగ్ క్యాంప్ ఈ నెల 17 నుంచి ప్రారంభించాలని తెలిపారు. ఈసీజీ, డెంటల్ సర్వీస్, ఆప్తమాలజీ, ఎక్స్‌రే, డెర్మాటాలజీ, ఎల్ఎఫ్‌టీ, ఈఎన్‌టీ సేవలను కనీసం వారంలో ఒకరోజు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. కోస్గి ఆస్పత్రిలో అవసరమైన సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు పంపించాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మసూద్‌ఖాన్, కోస్గి ఆస్పత్రి సూపరింటెండెంట్ మల్లిఖార్జున్, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


జూరాల ప్రాజెక్టు 9 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మళ్లీ భారీగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. గురువారం ప్రాజెక్టుకు 62 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 7 గంటల వరకు 1.15లక్షల క్యూసెక్కులకు పెరిగినట్లు అధికారులు పేర్కొన్నారు. దీంతో ప్రాజెక్టు 9 క్రస్టు గేట్లను ఎత్తి 61,376 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 41,283 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 47 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 550 క్యూసెక్కులు, కుడి కాల్వకు 490 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి 1.03 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.234 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జూరాల ఎగువ విద్యుదుత్పత్తి కేంద్రంలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తిని చేపడుతున్నట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

శ్రీశైలానికి నీటి ప్రవాహం

దోమలపెంట: జూరాల ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 61,376, విద్యుదుత్పత్తి చేస్తూ 41,283, సుంకేసుల నుంచి 35,568, హంద్రీ నుంచి 2,876 మొత్తం 1,41,103 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలానికి వస్తున్నాయి. శ్రీశైలంలో భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315, ఏపీ జెన్‌కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 30,852 మొత్తం 66,167 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.4 అడుగుల నీటి మట్టం వద్ద 206.5 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 23,666, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 2,696, ఎంజీకేఎల్ఐకు 1,600 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 16.777 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 15.264 మి.యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసులకు ఎగువ నుంచి శుక్రవారం 23 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. నాలుగు గేట్ల ను ఒక మీటర్ మేర తెరిచి 19,747 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 2,012 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

మారథాన్‌లో పీయూకు అవార్డు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి 5 కే రెడ్‌రన్ మారథాన్ పోటీలను ఐఈసీ డివిజన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించారు. పోటీల్లో పీయూ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కొల్లాపూర్ డిగ్రీ కళాశాల, వనపర్తి డిగ్రీ కళాశాల విద్యార్థులు మూడో స్థానంలో నిలిచారు. రూ.15 వేలు బహుమానం అందుకున్నారు. శుక్రవారం బహుమతులు సాధించిన విద్యార్థులను పీయూ వీసీ శ్రీనివాస్, రిజిస్ట్రార్ రమేష్‌బాబు అభినందించారు.

స్కూల్ ఆటో బోల్తా.. తప్పిన ప్రమాదం

స్వల్ప గాయాలతో బయటపడిన విద్యార్థులు


రోడ్డు పక్కన పొలంలో బోల్తా పడిన ఆటో

గట్టు: ప్రైవేటు పాఠశాలకు విద్యార్థులను తరలిస్తున్న ఆటో(టాటాఏస్) అదుపు తప్పి పొలంలో బోల్తా పడిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పూర్తి వివరాలు.. సల్కాపురం గ్రామానికి చెందిన సుమారు 20 మంది విద్యార్థులను ఆరగిద్దలోని ప్రైవేటు స్కూల్‌కు విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో సల్కాపురం శివారులో అదుపు తప్పి పొలంలో బోల్తా పడింది. వెంటనే స్పందించిన స్థానికులు విద్యార్థులను బయటకు తీశారు. పలువురు విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మరో నాలుగడుగులు దూరంలో పడి ఉంటే పెను ప్రమాదం జరిగేదని చెరువులో ఆటో పడేదని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీటీసీ కృష్ణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బజారి, బీఆర్ఎస్ నాయకులు రామునాయుడు, గోపాల్, గ్రామస్తులు సహాయక చర్యలు చేపట్టారు. డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ నిర్లక్ష్యంగా ఆటో నడపడం వలనే ప్రమాదం జరిగిందంటూ చిన్నారులు పేర్కొన్నారు. ప్రమాదంపై విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లేష్ తెలిపారు.

విద్యుదాఘాతంతో వృద్ధుడి మృతి

వనపర్తి రూరల్: విద్యుదాఘాతంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం సాయంత్రం మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని మెంటేపల్లి గ్రామానికి చెందిన నీలం కృష్ణయ్య(65) పొలంలో స్టార్టర్ పెట్టి ఆన్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య కమలమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
Hyd-రియల్ ఎస్టేట్ Co. కై మార్కెటింగ్ Exe. కావలెను. కోకాపేట్, శంకరపల్లిలో విల్లాస్/ప్లాట్స్ సేల్స్ కై జీ+కమ్+2 వీలర్+రూం+భో. ఫ్రీ. Age: 32, నె.లక్ష రూ. ఫ్రెష్/Exp. 7416396781
ప్రకటన గోరంత! స్పందన కొండంత!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
నాలుగు లైన్లకు రూ. : 200/- (Black & White)
అదనపు లైనుకు రూ. : 50
5% GST అదనం మాత్రమే
వివరాలకు :
9553955603
మహబూబ్‌నగర్ : 9705135557, 9010869797
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9553955603
గద్వాల : 9398469650
నారాయణపేట : 9010962007
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశదంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరుతున్నాము. ప్రకటనదారు తెలిపే లేదా వెబ్‌సైట్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బుల ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్